# జీవితకథలు

## 2




సాయం సమయం. సుమారు ఆరు గంటలు కావచ్చు. ఇచ్చిన భోజనం ముగించి ఎవరి పనుల్లో వాళ్ళున్నారు. కొందరు పిచ్చాపాటి మాట్లాడుతూ కాలాన్ని చంపేస్తూ వుంటే, మరికొందరు బారకట్ట (పచ్చీసు) ఆడుతూ కాలక్షేపం చేస్తున్నారు.

నేను యిల్లస్ట్రేటెడ్ వీక్లీ చూస్తున్నాను. ఇంతలో మెయిన్ గేటువద్ద కలకలం వినిపించింది. కోర్టుకు వాయిదా కొరకు వెళ్ళిన ఖైదీలు తిరిగి వచ్చినట్లుగా గ్రహించాను. పది నిమిషాలు గడిచాయి నా బెడ్ ప్రక్క అడుగుల శబ్దం వినిపిస్తే తలత్రిప్పి చూశాను. ఎదురుగా మానెయ్య. కండ్లు బాగా ఏడ్చినట్లు ఎర్రగా వున్నాయి తల రేగి వుంది ముఖం వాడిపోయి వుంది. వెంటనే గుర్తు వచ్చింది. ఈ రోజు అతని తీర్పు గ్రహించాను శిక్షపడివుంటుందని

"ఏమైందీ?" అడుగరాదని తెలిసీ క్యూరియాసిటీ చంపుకోలేక అడిగాను.

"యావజ్జీవితం" నోటికి గుడ్డ అడ్డు పెట్టుకొని వెక్కిళ్ళమధ్య స్పష్టంగా చెప్పలేకపోయినా తెలుసుకొన్నాను.

"భయపడకు మానెయ్యా, దేవుడు గొప్పవాడు...." ఇంకా నా మాటలు పూర్తికాకముందే బెక్కుతూ వెళ్ళిపోయాడు పాపం మానెయ్య. చాల మంచివాడు. నేను వచ్చిన క్రొత్తలో అతను చెప్పిన విషయాలు గుర్తుకు వచ్చాయి.

.... .... .... ........

అది మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ తాలూకాలోని చిన్నపల్లె హరిజనులయిన వీరన్న, రావమ్మలకు ఏకైక సంతానం మానెయ్య. అక్షరజ్ఞానం లేకున్నా వున్న కాస్తభూమిని వ్యవసాయం చేసుకుంటూ, మంచి, మర్యాద తోడుగా అందరి ఆపేక్షనూ చూరగొన్నాడు చక్కని గాత్రం దేవుడిచ్చిన వరం. రామాయణం, భారతం వంటి వీధినాటకాలు, జానపద గేయాలు నేర్పించుకొని పాడి అందరినీ ఆనంద పరచేవాడు.

అదే గ్రామవాసియైన ఎల్లమ్మ ప్రేమకు పాత్రుడయాడు పెద్దల ఆశీస్సులతో ఒకానొక శుభముహూర్తాన ఆమెను భార్యగా స్వీకరించాడు. చదువు సంధ్యలు లేకున్నా సంస్కారవంతమైన ఆమె సాంగత్యంలో కాలమే తెలియలేదు. నాగరికత కల్మషం చేయని స్వచ్ఛమైన ప్రేమను ఆమెనుండి పొందాడు. జీవితం ధన్యమైందనుకున్నాడు.

వారి ప్రేమ ఫలితమే సీత, గీత, కిష్టయ్యలు. భార్య, భర్త కష్టపడి వ్యవసాయంచేసి వున్నదానిలో తృప్తిగా కాలం గడుపుతూ వున్నారు.

ఒకానొక దుర్ముహూర్తాన మానెయ్య పనిమీద ప్రక్క గ్రామం వెళ్ళాడు. ఎల్లమ్మ గేదెలకు మేత కై చేనుకు వెళ్ళింది. అదే సమయంలో అటుగా వచ్చాడు కాపువారబ్బాయి. సమయం ప్రేరేపించింది. కామం కళ్ళు మూసింది. కోరిక పడగవిప్పింది.

ఎల్లమ్మ.... సబలగానే ప్రయత్నించింది. పశుత్వపు పట్టునుండి పారిపోవాలని ప్రాకులాడింది. పెనుగులాడింది. ఫలించని ప్రయత్నంలో అలిసిపోయింది.

గ్రామం చేరిన మానెయ్య స్పృహలేని ఎల్లమ్మను యింటికి చేర్చాడు. స్పృహ వచ్చిన తరువాత గతం గుర్తులేదు భర్త ఎవరో పిల్లలు ఎవరో-మతిభ్రమించింది. మానెయ్య గుండెలవిసేలా ఏడ్చాడు. గుండె మండింది. పేదరికం పెదవి కదుపనీయలేదు. ఈ సమయంలోనే పటేలు యివ్వవలసిన బాకీ క్రింద వున్న భూమిని వశపర్చుకున్నాడు.

దినం గడవటం కష్టమైంది. ఇతరులపై సాధించలేని ప్రతీకారాన్ని తనమీదే సాధించదల్చుకున్నాడు. భయంకరమైన నిర్ణయం తీసుకున్నాడు. ఆరోజు ఆదివారం క్రైస్తవుల ఆరాధ్యదినం. పిల్లలకు చాయ్ కాచి యిచ్చాడు. పిచ్చి భార్యకు త్రాగించాడు భార్యను యింటిలోవుంచి తలుపు మూసి గొళ్ళెం పెట్టాడు పిల్లలు ముగ్గుర్ని వెంట తీసికొని చిల్లర దుకాణం వేపు వెళ్ళాడు ముగ్గురికీ చాక్లెట్లు కొని యిచ్చాడు. వారిని వూరి వెలుపల వున్న బావివద్దకు తీసికొని వెళ్ళాడు. మూడు ప్రదక్షిణాలు చేశాడు. గుండె రాయిగా మార్చుకున్నాడు. కాలం స్తంభించింది. లోకం శూన్యమైంది. కళ్ళనుండి నిప్పు కణాలు నీటిరూపంగా బయటకు వస్తున్నాయి. దూరంగా యెక్కడో తీతువు అరుపు వినిపించింది.

అంతే.... ముందు కిష్టయ్య గీతలను ఎత్తి బావిలో వేశాడు ఘోరం కళ్ళారా చూసిన సీతకి వివేకం వెన్ను తట్టింది. తన శక్తికొలదీ గ్రామంకేసి పరుగు తీసింది తానుకూడా దూకబోయిన మానెయ్యను ఎవరో గట్టిగా పట్టుకొని నిరోధించారు. అంతే అతనికి తెలుసు.

తరువాత మానెయ్య పోలీసు స్టేషన్‌కు వెళ్ళాడు. పిల్లల శవాలు పోస్టుమార్టంకు వెళ్ళాయి సీతను సాక్ష్యంకోసం పటేలు తనవద్దనేఅట్టిపెట్టుకున్నాడు. ఇద్దరుపిల్లల హత్యాపరాధం మానెయ్యపై మోపబడింది....ఫలితం.... తెలిసిందే! మరి ఈ నేరానికి కారకుడయిన కిరాతకుడు........ క్షేమం...."భగవాన్"....అనుకున్నాను ఆ వెంటనే.... ....వున్నాడా?....ఎందుకో సందేహం....!

—'ప్రసాద్'